విశాలాంధ్ర గుంటూరు జిల్లా

శ్రీచైతన్య విద్యార్థుల విజయకేతనం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశ వ్యాప్తంగా జరిగిన క్యాట్ ఒలింపియాడ్ రెండవ లెవల్ పరీక్షల్లో పొన్నూరు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని గుంటూరు, ప్రకాశం జిల్లాల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య స్పష్టంచేశారు. క్యాట్ ఒలింపియాడ్ 2023-24 పరీక్షల్లో 121 మంది విద్యార్థినీ విద్యార్థులను ఆదివారం కళాశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. క్షుత్రిక అనే విద్యార్థిని రూ.2వేలు నగదు బహుమతి..మరో ముగ్గురు విద్యార్థులు వెయ్యి రూపాయల నగదు బహుమతి..మరో 52మందికి మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్, మరో 69 మందికి మెరిట్ సర్టిఫికెట్స్ సాధించినట్లు ప్రిన్సిపల్ ఎస్ఎఫ్ఎస్ బాషా పేర్కొన్నారు. క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థినీ, విద్యార్థులను ఆర్ఐ అప్పాజీ ఘనంగా సత్కరించారు. విద్యార్థినీ, విద్యార్థులను అభినందించిన వారిలో కో-ఆర్డినేటర్ గోపీ, డీన్ శేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గ్రంథాల ఆవిష్కరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక నగరంపాలెం బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి వైశ్య హాస్టల్ సమావేశ మందిరంలో బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రుల అభిమాన రచయిత్రి 'యద్దనపూడి సులోచన రాణి సాహిత్య వివేచన', రాయలసీమ తొలితరం నవల ఎంవి పాపన్న గుప్త రచించిన 'భానుమతి' పునర్ ముద్రణ పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నగరంలోని పలువురు ప్రముఖ రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. ఆకాశవాణి పూర్వ సంచాలకులు సులోచన రాణి, సాహిత్య వివేచన గ్రంథ సంపాదకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సభకు అధ్యక్షత వహించారు. దాన గుణ సంపన్నుడు, సాహితి పోషకులు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి గ్రంథాలను ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత్రి సరోజినీ ప్రేమ్ చంద్ యద్దనపూడి సులోచనారాణితో పెన వేసుకున్న అనుబంధం..ఆమె సాహిత్య రచనలపై చేసిన సోదాహరణ ప్రసంగం ఆకట్టుకుంది. ప్రముఖ నాటక రచయిత, 2023 రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత పిన్నమనేని మృత్యుంజయరావు భానుమతి నవలపై విశ్లేషించారు. సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ సభ నిర్వహణ గావించారు.

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కృషి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వెనకబడిన బడుగు, బలహీన వర్గాల ప్రజా సమస్యల కోసం నిరంతరం పని చేస్తున్న తెలుగుదేశం పార్టీ బీసీ వర్గ నాయుడు నందూరి సాయిని తెలుగుదేశం పార్టీ గుర్తించి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా ఎన్నిక చేయటంలో ప్రధాన భూమిక నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌లకు రుణపడి ప్రజా సమస్యల పరిష్కారం వైపున తెలుగుదేశం పార్టీ నాయకత్వాన కృషి చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా ఎన్నిక చేసినందుకు నారా చంద్రబాబు నాయుడుకి, కొమ్మాలపాడు శ్రీధర్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు నూతనంగా ఎన్నికైన సాయిని ఘనంగా సత్కరించారు

కూడిపూడి నృత్య కళాకారిణులకు సత్కారం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలోని శ్రీ నటరాజ నృత్యాలయం వ్యవస్థాపకురాలు బట్టు తిరుమల కళ్యాణి, తన శిష్య బృందంతో ఈ నెల 24వ తేదీ హైదారాబాద్‌లోని భారత్ అకాడమీలో జరిగిన కూచిపూడి కళా వైభవం, మహా బృందవైభవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు అయింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మంగళగిరి కళాకారులను ఆదివారం మంగళగిరిలోని రామనాథం చినకోటయ్య, శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆశ్రమ అధ్యక్షులు, సామాజిక కార్యకర్త రామనాథం వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గంజి చిరంజీవి పాల్గొన్నారు. మంగళగిరికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణులైన విట్టంశెట్టి జాహ్నవి, విట్టంశెట్టి మోక్షశ్రీ, మేడి భవ్యహరివర్థిని, కొల్లి యశస్వి నీరజ, ఆకురాతి దీక్ష, గుల్లదుర్తి గోకుల, తుమ్మలచర్ల దీపిక, మనస్విని, మల్లవరపు సుదీప్తి, చిట్టేల శ్రీ భార్గవి, రామనాథం అమృత, కూరపాటి సింధు, కొల్లి భార్గవిలను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, తెలుగుదేశం పార్టీ నాయకులు మునగపాటి వెంకటేశ్వరరావు, రామనాథం సాంబశివరావు, దీపాల సాంబశివరావు తదితర స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

'ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన'

విశాలాంధ్ర-మంగళగిరి : నిడమర్రు గ్రామంలోని జడ్పీ హైస్కూల్ నందు మానవ సేవా సంస్థ నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మంగళగిరి వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గంజి చిరంజీవి, తాడేపల్లి మంగళగిరి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం, మునుగోడు హనుమంతరావు, గంజి చిరంజీవిలు మాట్లాడుతూ మానవ సేవా సంస్థ ద్వారా వంగర సురేష్ కుమార్ ఎన్నో వేల మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరిగిందని, వంగర సురేష్‌కుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి కూడా ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శశిధర్, డాక్టర్ అనూష, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుల గణన

విశాలాంధ్ర-తాడికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన కార్యక్రమం కొనసాగుతోంది. ఈనెల 19 నుండి 28 వరకు ఆయా గ్రామాలలో ఉన్న వాలంటర్లు, విలేజ్ పోలీసుల సహకారంతో కులగణన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు . ప్రధానంగా కుటుంబ వివరాలు స్థితిగతుల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఆదివారానికి 80 శాతం పైబడి కుల గణన పూర్తి అయినట్లు తెలిసింది.

రా కదిలి రా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకాకాని: 29న జరిగే రా కదిలి రా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ ప్రచార కార్యదర్శి కొమ్మూరి మల్లికార్జున రావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో మల్లికార్జున రావు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణల అభివృద్ధికి గత తెలుగుదేశం ప్రభుత్వం కుటుంబానికి రెండు లక్షల రూపాయలను కేటాయించి ఆదుకుందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో నాయి బ్రాహ్మణులకు ఎలాంటి ఉపాధి కల్పించలేదని ఆవేదనే వ్యక్తపరిచారు. రాబోవు ఎన్నికలలో నాయి బ్రాహ్మణ సోదరులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా నాయి బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు మున్నంగి శివ శేషగిరి, జిల్లా అధ్యక్షులు నాదెండ్ల వెంకటేశ్వర్లు, మండల నాయకుడు కాకాని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

విశాలాంధ్ర-మంగళగిరి: నగరంలోని ఆల్ఫా హోటల్ ఎదురుగా పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. రాబడిన సమాచారం మేరకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల నేపథ్యంలో ఎస్సై మహేంద్ర సిబ్బందితో కలిసి ఆకస్మికంగా పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. వారి వద్ద నుండి 17,300 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు. ఏఎస్సై సలావుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం లేదు : ఎంపీ గల్లా

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: 2024 ఎన్నికల్లో తాను పోటీచేయడం లేదని, గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ తెలిపారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎంపీ జయదేవ్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తనను లక్ష్యంగా చేసుకున్న ప్రస్తుత పరిస్థితుల్లో మౌనం గా ఉండలేకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. రాజకీయాల్లో ఉంటే నా పని చేయలేకపోతున్నా. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదన్న ఆయన తాజా నిర్ణయం తాత్కాలికమేనని చెప్పారు. నిజాయతీ గల వారు రాజకీయాల్లోకి వచ్చిన మౌనంగా ఉండటం తప్పం ఏం చేయలేని పరిస్థితి నెలకొంద న్నారు. వనవాసం తర్వాత శ్రీరాముడు, పాండవులు వచ్చినంత బలంగా తిరిగి రాజకీయాల్లోకి వస్తానని వెల్లడించారు. మళ్లీ పోటీ చేసినా గెలుస్తాను. పార్లమెంటులో మౌనంగా కూర్చొవడం నా వల్ల కాదన్నారు. 'కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలతో ఎదురవుతున్న ఇబ్బందుల్ని చూస్తూ పార్లమెంట్లో మౌనంగా కూర్చోలేనన్నారు. స్థానిక టీడీపీ నాయకులు, ప్రజలను నమ్ముకొని ముందుకు వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం లేదన్నారు. ప్రాంతీయ పార్టీలలో పార్టీ లైన్ ప్రకారం మాట్లాడాల్సి ఉంటుందన్నారు. ఏపీలో పరిశ్రమల విస్తరణకు ఇబ్బందులు కలిగాయి. దీంతో తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో నెలకొల్పామని, విదేశాల్లోనూ విస్తరిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర హక్కుల కోసం పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెట్టిన సమయంలో మాట్లాడాను. ప్రభుత్వం నుంచి బయటకి వచ్చినప్పుడు అవిశ్వాసం పెట్టారు. ఆ సమయంలో పార్టీ గొంతు నేనే వినిపించా. దీనిని దృష్టిలో ఉంచుకొని వివిధ కేసుల్లో ఈడీ నన్ను రెండు సార్లు పిలిచి విచారించింది. దాంతో ఈడీ అధికారులు నన్ను పిలిచి బెదిరించారు. 2019లో ప్రజలు రెండోసారి ఎంపీగా గెలిపించారు. అప్పుడు కూడా ప్రతిపక్ష ఎంపీగా మాట్లాడాను. అమరావతి రైతులతో ఛలో అసెంబ్లీ నిర్వహించాను. పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. అమరావతి పేరును దేశ చిత్ర పటంలో పెట్టేలా చేశానన్నారు.

రాష్ట్రం మొత్తం మంగళగిరివైపు చూసేలా అభివృద్ధి చేస్తా :లోకేష్

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరిలో ఎక్కడ అధికార వైసీపీ కనపడటం లేదు, 72 రోజుల తర్వాత రాష్ట్రవ ంతా మంగళగిరి వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపి స్తానని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగి రిలో వైసిపి నుంచి టిడిపిలోకి వలసల పరంపర కొన సాగుతోంది. యువనేత పిలుపుతో ఊళ్లకు ఊళ్లు వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకుంటున్నాయి. ఇందు లో భాగంగా ఆదివారం వైసిపికి చెందిన పలువురు ప్రముఖులతోపాటు 500కు పైగా కుటుంబాలు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారందరికీ పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... 2019లో అతితక్కువ సమయం ఉండటం వల్ల మంగళగిరి ప్రజల సమస్యలు తెలుసుకోలేక పోయానని చెప్పారు. అయితే 2019లో మంగళగిరిలో ఓడిపోయాక నాలో కసి పెరిగింది, ఓడిపోయినా కూడా 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మంగళగిరిలో అమలు చేస్తున్నాను. గత అయిదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదు. కనీసం ఒక్క ఇల్లు కూడా కట్టించలేదు, ఇన్ని రోజులు పట్టించుకోని వైసిపి నాయకులు ఇప్పుడు ఇళ్లపట్టాలిస్తామని హడావిడి చేస్తున్నారు. 72రోజుల్లో రాబోయే ఎన్నికల తర్వాత మంగళగిరితోపాటు రాష్ట్రమంతా పసుపుమయం కాబోతోంది, అధికారంలోకి వచ్చాక యావత్ రాష్ట్ర ప్రజానీకం మంగళగిరివైపు చూసేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టమొచ్చినా తాను కంటికి రెప్పలా చూసుకుంటానని లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నందం అబద్దయ్య, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో 'గల్లా' చిరస్థాయిగా నిలిచిపోతారు : సాయి కృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ గల్లా తెలుగు ప్రజల మణి కిరీటంలాగా గుంటూరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ కొనియాడారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాష్ట్ర హక్కుల కోసం పోరాడిన తీరు నేటి యువతకు ఎంతో స్ఫూర్తి దాయకమని అన్నారు. జయదేవ్ ప్రత్యక్ష రాజకీయాల నుండి తాత్కాలికంగా నిష్క్రమిస్తూ కృతజ్ఞతాభివందనం పేరుతో గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ హాల్ నందు ఆదిఆటవరం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన నేపథ్యంలో సాయి కృష్ణ ఆధ్వర్యంలో పార్లమెంట్లో ప్రత్యేక హోదా విభజన హామీల కోసం గళం విప్పిన చిత్రాలు, అమరావతి రాజధాని కోసం రైతుల పోరాటంలో ఎదురుకున్న విచారక సంఘటనలను గుంటూరు పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు భారీ సైకత శిల్పంలో పొందుపరిచి గల్లా జయదేవ్ భారీ సైకత శిల్పాన్ని ప్రత్యేకంగా అంతర్జాతీయ సైకత శిల్పి ఆకునూరు బాలాజీ వరప్రసాద్ చే రూపొందించి ప్రదర్శనలో ఉంచారు. పార్లమెంట్ సభ్యులు జయదేవ్‌తో పాటు, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, అర్బన్ టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్, గుంటూరు పశ్చిమ టిడిపి ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్రలతో పాటు టీడీపీ నేతలు, అమరావతి రైతులు, సభకు హాజరైన వేలమంది ప్రజలు సందర్శించి హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ గల్లా లాంటి నిస్వార్ధ సేవకుడు రాజకీయ నిష్క్రమణ బాధాకరం. డబ్బుతో జ్ఞాపికగా అటువంటి ఆగర్భ శ్రీమంతుడికి ఏమి ఇవ్వలేను. చిరకాలం మా గుండెల్లో గూడు కట్టుకుంటారు అని తెలియజేస్తూ కల్మషం లేని గుంటూరు గుండె శబ్దం గల్లాకు గుర్తుగా తెలుగుయువత ఆధ్వర్యంలో సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసి అభిమానాన్ని చాటుకోవటం జరిగిందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ

విశాలాంధ్ర-మంగళగిరి : కృష్ణాయపాలెం గ్రామ మాజీ ఎంపీటీసీ టిడిపికి చెందిన రాచకొండ వెంకయ్యమ్మ ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళగిరి నగరంలోని ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆమెకు పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ గంజి చిరంజీవి పార్టీ కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. అదే గ్రామంలోని టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం రాచకొండ వెంకయ్యమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు నచ్చి గంజి చిరంజీవి నాయకత్వంపై నమ్మకంతో ఆ పార్టీలో చేరినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో చిరంజీవి గెలుపుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాచకొండ చిరంజీవి, దేవరాజు, పద్మావతి, శ్రావణి, పూజిత, గజ్జలకొండ వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, సురేష్, హేమంత్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరగా ఈపూరి ఆదాం, పార్టీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, వైసీపీ ఎర్రబాలెం అధ్యక్షులు గుండాల శ్రీను , సునీల్ తదితర కార్యకర్తలు హాజరయ్యారు.

నేడు దుగ్గిరాలలో బాధిత పసుపు రైతుల సదస్సు

విశాలాంధ్ర-మంగళగిరి : దుగ్గిరాల మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న శుభం మహేశ్వరి స్టోరేజ్ నందు ఈ నెల 29న (సోమవారం)ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతుల సంఘం సమితి, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధితుల పసుపు రైతుల సదస్సు జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్యలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జంగాల అజయ్ కుమార్, చిన్ని తిరుపతయ్యలు మాట్లాడుతూ ఇటీవల దుగ్గిరాల మార్కెట్ యార్డ్ వద్ద శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ నందు జరిగిన అగ్నిప్రమాద కారణంగా రైతుల నిలవ చేసుకున్న పసుపు ఇతర పంటల అగ్నికి ఆహుతి అయినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం జరిగే సదస్సుకు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ రైతు సదస్సులో భవిష్యత్తులో జరిగే పోరాటాలకు వేదిక కానున్నదని, కమిటీలను కూడా ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో రైతులందరూ పాల్గొని సదస్సు విజయవంతం చేయాలని కోరారు.

రైఫిల్‌లో కేఎల్‌యూ విద్యార్థులకు పతకాలు

విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్‌యూడీమ్డ్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు తనీష్ మురళీధర్ అనే విద్యార్థి బంగారు పతకం సాధించగా, నేలవల్లి ముఖేష్ వెండి పతకం సాధించినట్లు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కే హరి కిషోర్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ రైఫిల్స్ షూటింగ్ మరోసారి బంగారు పతకం సాధించాడు. ఈనెల 19వ తేదీ నుండి 30వ తేదీ వరకు చెన్నై లోని వెలచ్చేరి అన్నా గార్డెన్ లో జరిగిన 6వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో 24 మీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలలో కెఎల్ హెచ్, బిబిఎ మొదటి సంవత్సరం చదువుతున్న తనీష్ మురళీధర్ బంగారు పతకం సాధించగా, కెఎల్ యు సిఎస్ ఐటి రెండవ సంవత్సరం చదువుతున్న నేలవల్లి ముఖేష్ వెండి పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు వెలివెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సులర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, రిజిస్టర్ డాక్టర్ కే సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ హనుమంతరావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె హరి కిషోర్, వ్యాయామ అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరిక

విశాలాంధ్ర-తాడేపల్లి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని చిర్రావూరులో వైసీపీ నుండి టిడిపిలోకి మక్కపాటి ఏసు ప్రసాద్, వారితో పాటు 80 మంది టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. ముందుగా చిర్రావూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. టిడిపి తాడేపల్లి మండల రూరల్ అధ్యక్షులు అమరా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, చిరావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, నల్లిబోయిన శ్రీనివాసరావు, పల్లంపాటి సాంబశివరావు,జంగాల సాంబశివరావు, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడు, చిరంజీవిలకు పద్మవిభూషణ్‌పై హర్షం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మాజీ ఉప రాష్ట్రపతి తన అనుపమాన వాగ్ధాటితో ఆసేతు హిమాచలం అభిమాన ధనాన్ని సొంతం చేసుకున్న తెలుగునేత వెంకయ్య నాయుడికి, నాలుగున్నర శతాబ్దాలుగా సినీ రంగంలో తనకంటూ ఓ శైలిని ఏర్పాటు చేసుకొని ప్రయాణం చేసిన..చేస్తున్న తిరుగులేని కథానాయకుడు చిరంజీవికి పద్మ విభూషణ్ పురస్కారాలు ప్రకటించడం తెలుగు వారందరికీ గర్వకారణమని అవగాహన సంస్థ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లలో అంత్యప్రాసలతో హాస్యాన్ని రంగరించి ఆలోచనాత్మక ప్రసంగం చేయటం వెంకయ్యనాయుడు గారికే చెల్లిందని, దక్షిణాది నుంచి రాజకీయంగా ఎదిగినా ఉత్తరాది నాయకులతో సమానంగా దేశ రాజధానిలో గుర్తింపు పొందిన విశిష్ట వ్యక్తిత్వం వెంకయ్య నాయుడు సొంతమన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా గ్రామీణ వేష, భాషలను వీడని వ్యక్తిత్వం వెంకయ్య నాయుడు ప్రత్యేకత అని, విలక్షణమైన నటనతో ఎన్నో పాత్రలకి, కథలకు జీవం పోసింది చిరంజీవి స్టైల్ అని, ఆయన మేనరిజమే 'మాస్' అనే మాటకు సరికొత్త నిర్వచనం చెప్పిందన్నారు. ఈ లక్షణాలే ఆయనను అగ్రపీఠంపై కూర్చొబెట్టాయని ఆయన సేవాగుణం కూడా పద్మ విభూషణ్ గౌరవానికి కారణమైనట్లు తెలిపారు.

రోగులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వం అన్ని విధాలుగా క్యాన్సర్ పేషంట్లకు తోడుగా ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదని గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం జీజీహెచ్‌లో ఉన్న నాట్కో సెంటర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ విభాగంలో 110 పడకలు ఉండగా పూర్తి స్థాయిలో పేషంట్లు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. నాట్కో ఆసుపత్రిలో రేడియాలజీ, సర్జికల్, మెడికల్ అంకాలజీ విభాగాలు ఉండగా...అందులో చికిత్స పొందుతున్న ప్రతి పేషంట్‌ను డాక్టర్ కిరణ్ కుమార్ పలకరిస్తూ.. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పేషంట్లు..వారి సహాయకులు సైతం ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో కేంద్రంలో అందుతున్న సేవలుపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఆసుపత్రిలోని పలు విభాగంలోని టాయిలెట్స్‌ను ఆయన పరిశీలించారు. టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. టాయిలెట్స్‌ను పరిశు భ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అయన శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. ఉదయం ఏడు గంటలకు వచ్చి గదులను శుభ్రం చేసి పట్టలతో పరిశుభ్రతగా ఉంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా బేగం పాల్గొన్నారు.

పసుపు రైతుల సదస్సు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల: పంట నష్టపోయిన బాధిత రైతులకు ఇన్సూరెన్స్ నష్టపరిహారం కోరుతూ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు పసుపు మార్కెట్ యార్డులో బాధిత పసుపు రైతుల సదస్సు జరుగుతుందని, రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని సదస్సుని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతు సంఘం ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పసుపు రైతులు, నిల్వబెట్టుకున్న రైతులు తమ సరుకు వివరాలు బాండ్ పేపర్లు తీసుకొని రావాలని తెలియజేశారు.

దాడి చేసాడంటూ ఫిర్యాదు

విశాలాంధ్ర-తాడికొండ: తనపై అకారణంగా దాడి చేశాడంటూ పేపర్ బాయ్ ఫిర్యాదు చేసిన సంఘటన తాడికొండ సిఐ ప్రభాకర్ రావు తెలిపిన వివరాలు ప్రకారం తాడికొండ గ్రామానికి చెందిన తాడి బోయిన సుభాష్ కొంతకాలంగా పేపర్ బాయ్ గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రోజు మాదిరిగానే ఆదివారం కూడా పేపర్ వేస్తున్నాడు. షేక్ జుబేర్ వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లి పేపర్ అందజేస్తున్నాడు. తనకు పేపరును ఆలస్యంగా ఇస్తావా అంటూ సుభాష్‌తో జుబేర్ వాగ్వాదానికి దిగి దాడికి తెగపడ్డాడు. ఎడమ కంటికి గాయమైంది. సుభాష్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. జుబేరును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఇరు వర్గాలతో పోలీసులు మాట్లాడుతున్నారు.

వివిధ రంగాల్లో రాణించిన వారికి సన్మానం

విశాలాంధ్ర, తెనాలి : తెనాలిలో ఎవిఎస్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాల్లో మానవత సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణించిన ప్రముఖులు ఎన్ఆర్ఐ డా.బాబు ఆర్ వడ్లమూడి, యుయస్ఏ ప్రముఖ శిల్పకళాకారులు అక్కల రామకృష్ణ, సహజ కవి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బనాల మల్లేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. మానవత ఛైర్మన్ కొలసాని రాంచంద్ సంస్థ చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. మానవత నిర్వాహకులు కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మనవత ఆధ్వర్యంలో సమాజ శ్రేయస్సు కోరే కార్యక్రమాలకు సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని, ఇంకా చేయాల్సిన వాటిని రూపొందించి అమలు చేయాలని చెబుతూ వాటిని తప్పక ఆచరిస్తామన్నారు. వై.రోహిణి, ఉన్నం అశోక్, ఆలపాటి వెంకటరామయ్య, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

హామీలన్ని నెరవేర్చిన నాయకుడు సీఎం జగన్

విశాలాంధ్ర-ఫిరంగిపురం: గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్ని నెరవేర్చిన మహా నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని మాజీ హోంశాఖామాత్యులు తాడికొండ సమన్వయకర్త మేకతోటి సుచరిత కొనియాడారు. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్ అండ్ హెల్‌నెస్ ఆరోగ్య కేంద్రాలను సుచరిత మరో గౌరవ అతిథి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుచరిత మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య, వైద్య, సచివాలయ రంగాల అభ్యున్నతికి సిఎం జగన్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ఒక లక్షా వేభై వేల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించి కుల మతాలకు అతీతంగా ఎన్నో సంక్షేమ పథకాలు కల్పించిన ఘన జగన్మోహన్‌రెడ్డిదే నన్నారు. మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, ఫిరంగిపురం సొసైటీ చైర్మన్ బొడపాటి వెంకటేశ్వరరెడ్డి, బేతపూడి సొసైటీ చైర్మన్ షేక్. ఖాజావలి, విజయలక్ష్మి, గుమ్మడి చంద్రం, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇందూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మీ, ఈశ్వరరెడ్డి, పెరికల జేమ్స్, చిన్నప్పరెడ్డి వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు ఎంపిటిసిలు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఆదుకోవాలన్నదే లక్ష్యం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతో రుద్ర ఛారిటబుల్ ట్రస్ట్ గత రెండు దశాబ్దాలుగా కృషి చేస్తుందని రుద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు షేక్.మహబూబ్ సుభాని పేర్కొన్నారు. అన్నదానం, రక్తదానాలతో పాటు కరోనా సమయంలో వేలాది మృతులకు అంతిమ సంస్కారాలు నిర్వహించిన రుద్ర చారిటబుల్ ట్రస్ట్ బృందాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం స్థానిక రామన్నపేటలో ఉన్న జనచైతన్య వేదిక హాల్లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ మహబూబ్ సుభాని గుంటూరు నగరంలో నిరంతరం అన్నదానం, రక్తదానంతో పాటు అభాగ్యులకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు మానవతా అధ్యక్షురాలు పి.కమల కుమారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ ఎస్.అరవింద్, ప్రత్యూష సుబ్బారావు, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు టి.సేవ కుమార్, మానవత కన్వీనర్ వీవీ నాగిరెడ్డి, డైరెక్టర్ ఉప్పల సాంబశివరావు, బివన్ మిత్ర, కోశాధికారి, టీవీ సాయిరాం, కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం, వ్యవస్థాపక కార్యదర్శి ఏనుగుల రమణబాబు, మహిళ విభాగ అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి, మెడికల్ విభాగ కన్వీనర్ టి.ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత పసుపు రైతులకు పరిహారం అందించాలి

విశాలాంధ్ర, తెనాలి : శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాద బాధిత పసుపు రైతులకు మార్కెట్ విలువ ప్రకారం విలువ నిర్ణయించి రాష్ట్రప్రభుత్వం పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు ఆదివారం తెనాలిలో సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సుమారు 15వేల బస్తాలకు పైగా పసుపు అగ్నికి ఆహుతైందని, దీనివల్ల రైతాంగం ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్‌లో పెట్టిన సరుకుకు ఇన్సూరెన్స్, స్టోరేజీకి అద్దె చెల్లిస్తూ నిల్వ చేసుకున్న పసుపు బస్తాలు బుగ్గిపాలవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపుకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసి ఉంటే రైతులు ఈరోజు నష్టపోయేవారు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే ఈ నెల 29వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటలకు దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుకు మాజీ మంత్రివర్యులు నక్కా ఆనందబాబు, రేపల్లె మాజీ శాసనసభ్యులు ముమ్మనేని వెంకట సుబ్బయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. ప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సాంబశివరావు, సిపిఐ నాయకులు బొల్లిముంత కృష్ణ, యార్లగడ్డ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధి సేకరణకు ప్రజలు సహకరించాలి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సీపీఐ పార్టీ నిరంతర పోరాటాలకు అవసరమైన ఖర్చుల కొరకు నిధి సేకరణ కార్యక్రమం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్నామని నగర ప్రజలు సహక రించాలని సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. అలాగే నిధి సేకరించాల్సిందిగా పార్టీ శాఖలు, ప్రజా సంఘాల శాఖ కార్యదర్శి, సభ్యులను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ 50వ డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం నిధి సేకరణ కార్యక్రమం నిర్వహించబడినది. కోట మాల్యాద్రి మాట్లాడుతూ సీపీఐ పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన సమస్యలపై నిత్యం పోరాటం నిర్వహిస్తున్న సిపిఐ ని నగర ప్రజలు ఆదరించాలని కోరారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాకంటక పాలన కొనసాగిస్తున్నాయని రాబోవు కాలంలో వారికి వ్యతిరేకంగా పోరాటాలు పెద్ద ఎత్తున చేయవలసిన అవసరం ఉన్న ఈ పరిస్థితులలో జరుగుతున్న ఈ సేకరణ ప్రాముఖ్యతను సంతరించుకుందని అన్నారు.

ముఖ్యమంత్రిపై షర్మిల మాటలు హాస్యాస్పదం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించడం హాస్యాస్పదం అని బోరుగడ్డ అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ షర్మిల తెలంగాణ రాష్ట్రంలో పార్టీ పెట్టి తనను నమ్మి తన వెంట నడిచిన అనేకమంది కార్యకర్తలను, నాయకులను ముంచి, తన కుటుంబానికి అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరి ఆమె పార్టీని విలీనం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవడం సిగ్గుచేటని అన్నారు. తన స్వార్థ రాజకీయం కోసం తెలంగాణా నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అడుగుపెట్టి తన అన్న జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కేవలం తన ప్యాకేజీ కోసం, తన స్వార్థ రాజకీయం కోసమే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి కృషి చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తన తప్పు సరిదిద్దుకొని ఆమె ముందుకు సాగాలని, మరోసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురించి గానీ ప్రభుత్వం గురించి గానీ మాట్లాడితే సహించేది లేదు హెచ్చరించారు.

ఉత్కంఠభరితంగా ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్

విశాలాంధ్ర-మంగళగిరి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం(భోగి ఎస్టేట్స్)లో జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ - 2 పోటీలలో తాడేపల్లికి చెందిన వల్లభనేని వెంకట్రావు యూత్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో డీజే 2023 జట్టు 54 పరుగులతో విజయం సాధించి మూడవ స్థానంలో నిలిచింది. మధ్యాహ్నం వల్లభనేని వెంకట్రావు యూత్ వర్సెస్ అన్‌స్టాపబుల్ మధ్య ఉత్కంఠ బరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వల్లభనేని వెంకట్రావు యూత్ జట్టు గెలుపొందింది. అనంతరం బహుమతులు అందజేశారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన NIVARA HOME FINANCE LTD., GUNTUR BRANCH వారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు వద్దకు గుంటూరు సిటీ, నల్లపాడు యస్.సి. కాలనీ కాపురస్తులు లేటు మేరుగ కృపానందం గారి కుమారుడు శ్రీను గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి ది.26-03-2019వ దఖలు దస్తావేజు నెం. 2096/2019 యస్.ఆర్.ఓ. నల్లపాడుగా దఖలు పొంది, అట్టి ఆస్తిని సర్వహక్కులతో అనుభవించుచూ సదరు ఆస్తిపై ఋణం కొరకు నాక్లయింటును సంప్రదించియున్నారు. సదరు ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజులు అనగా ది.08-04-1968 విక్రయ ద.నెం.1643/1968 యస్.ఆర్.ఓ. గుంటూరు, ది.19-12-2020 మార్టిగేజ్ ద.నెం.5989/2020 యస్.ఆర్.ఓ నల్లపాడు మరియు ది.15-02-2022 చెల్లు రసీదు ద.నెం.1141/2022 యస్.ఆర్.ఓ నల్లపాడు గల దస్తావేజులు పోయినవని దొరకలేదని, దొరికినవారు తెచ్చి ఇవ్వగలరని తెలియజేసి సదరు ఆస్తిపై ఋణంకొరకు నాక్లయింటును సంప్రదించియున్నందున సదరు షెడ్యూలు ఆస్తిపై గాని, పోయిన దస్తావేజులపై గాని, మంజూరుచేయు ఋణముపై గాని ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియ జేయవలెనని గడువు లోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించి లోనుమంజూరు చేయబడును మరియు గడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు,వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయబడవు.

షెడ్యూలు: గుంటూరు డి॥ & సబ్.డి॥, ప్రస్తుతం నల్లపాడు సబ్.డి॥, జి.యం.సి. ఏరియాలో చేరిన నల్లపాడు గ్రామ డి.నెం.460 య.3-13సెంట్లు మింజుమలె ఉత్తరపువైపు య.0-26 సెంట్లలో చ.గ.336-7లు స్థలము, ఇందులోని డోర్. నెం. 3-103/1రు, పాత అసెస్మెంట్ నెం.53-156, కొత్త అసెస్మెంట్ నెం.127835 గల పెంకుటింట్లో తూర్పు వైపు చ.గ.158-3 స్థిరాస్తి నివేశన స్థలము, పెంకుటింటికి హద్దులు. తూర్పు:నడవ శౌరి వగైరాల స్థలము హద్దు, అ.33లు, దక్షిణం: మున్సిపల్ రోడ్డు హద్దు, అ.38-9లు, పడమర: మేరుగ వీరయ్య ఆస్తి అ.40-3లు, ఉత్తరం: శానం చిన దావీదు గారి ఆస్తి, అ.39-7లు.

K. HARI SANKARA PRASAD, M.A., L.L.B., Advocate, Dr.No.87-142/1, Sambasiva Nagar, Lalpuram Road, Chuttugunta, Guntur -4, Cell No.9490343123

ప్రభుత్వ నిరంకుశ విధానాలతో సమస్యల వెల్లువ

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్

విశాలాంధ్ర-దాచేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక నిరంకుశ విధానాల ఫలితంగా జిల్లాలో అనేక ప్రజా సమస్యలు చెత్తబుట్ట పాలవుతున్నాయని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా దాచేపల్లి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బాబురావు అధ్యక్షతన జరిగిన గురజాల నియోజకవర్గ సమితి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సమస్యలను గాలికి వదిలి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి 2024 ఎన్నికల్లో తాను మరల ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం కోసం నానాపాట్లు పడుతున్నారని ఆయన విమర్శించారు. 2019 ఎన్నికలప్పుడు తాను అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తానని, రాష్ట్ర రాజధానిని అమరావతిలోని నిర్మిస్తానని, విభజన హామీలను కేంద్రంపై కొట్లాడి సాధిస్తానని, నిత్యవసరాల సరుకుల ధరలు పెరగవని, పెట్రోల్ డీజిల్ రేట్లను రాష్ట్రంలో అదుపులో ఉంచుతానని, కరెంటు చార్జీలు పెంచనని, ఇలా అనేక వాగ్దానాలు చేసి అధికారంలో కి వచ్చిన పిమ్మట ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అటకెక్కించారని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పంగనామాలు పెట్టి 23 మంది ఎంపీలు 9 మంది రాజ్యసభ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికిని కేంద్రంపై పోరాడి ప్రత్యేక హోదా సాధించలేదని, దీని ఫలితంగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడిందని విభజన హామీలు అమలు చేయుటలో జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విఫలం చెందారని ఆయన అన్నారు. కరెంటు చార్జీలు విపరీతంగా 8 సార్లు పెంచిందని, ఆర్టీసీ బస్సు చార్జీలు విపరీతంగా పెంచిందని, ఇంటి పన్ను నీటి పన్ను చెత్త పన్ను హోల్ సేల్‌గా పన్నులన్నింటినీ ప్రజలపై విపరీతంగా మోపిందని, పెట్రోల్ డీజిల్ రేట్లు అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్రంలో ఒక ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తెస్తూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం విభజన హామీల అమలు కోసం సుదీర్ఘ పోరాటం నిర్వహించామని, జగనన్న కాలనీలలో ప్రభుత్వం పేద ప్రజలకు ఒక సెంటు భూమి కేటాయిస్తుంటే సిపిఐగా పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు కావాలని, అలాగే జగనన్న ఏళ్లకు ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇసుక సిమెంటు ఇనుము ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో లక్షలాదిగా కట్టబడి ఉన్న టిడ్కో గృహాలను అర్హులైన వారందరికీ స్వల్పకాల రిపేర్లు చేసి వెంటనే పంపిణీ చేయాలని పోరాటం చేసామన్నారు. సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, మతోన్మాద నిరంకుశ నిర్ణయాల ఫలితంగా సామాన్యుడు సంతోషంగా జీవించే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 29న విజయవాడలో జరిగే యువజన సంఘం సదస్సుకు యువకులను పంపాలని, ఈనెల 31వ తేదీన విజయవాడలో ధర్నా చౌక్ వద్ద ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మద్యానికి వ్యతిరేకంగా జరిగే ధర్నాకు మహిళలను పంపాలని నిర్ణయించామన్నారు, ఈ నేపధ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ నిరంతరం ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతూ సంవత్సరానికి ఒకసారి సభ్యత్వం రెన్యువల్ చేసుకుంటూ నిధి సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామని గురజాల నియోజకవర్గంలోని అన్ని గ్రామ శాఖలను పట్టణ శాఖలను వెంటనే సమావేశపరిచి సభ్యత్వం పూర్తి చేయుట నిధి సేకరణ పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, వెంకట్ రెడ్డి, బుర్రి కృష్ణారెడ్డి, కొమెర వెంకటరావు, సర్వయ్య,వీరా చారి, షేక్ గాలేషా,ఎల్. శాంతి, కాపర్తి వెంకటేశ్వర్లు, షేక్ హసన్ కమిటీ మరియు సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

103 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించడం శోచనీయం

విశాలాంధ్ర-అమరావతి: రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టి వల్ల కరువుతో విలయతాండవం చేస్తూ ఉంటే కేవలం 103 మండలాలు కరువు ప్రాంత మండలాలుగా ప్రభుత్వం ప్రకటించటం శోచనీయమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బైరావటం రామకృష్ణ , పెద్దకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యాదర్శి మునగొటి శ్రీనివాసరావు, సిపిఐ నియోజవర్గ నాయకులు శరణం విజయ అన్నారు . ఆదివారం మండల కేంద్రమైన అమరావతి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరావతి మండల సీపీఐ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి మండల సీపీఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధి కోసం నిరంతర శ్రమిస్తానని ప్రజలకు నమ్మబలికి అధికారాన్ని చేపట్టిన తర్వాత రాష్ట్రాన్ని తిరోగమన వైపు నడిపించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. మునుగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోనే వివిధ మండల పరిదిలోని గ్రామాలలో మౌలిక సదుపాయాల రూపకల్పనలో యావత్తు ప్రభుత్వం యంత్రాంగం వైఫల్యం చెందిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి అధికారంలోకొస్తే మధ్య నిషేధాన్ని అమలుపరుస్తానని నమ్మబలికి అధికారాన్ని చేపట్టిన తర్వాత మంచినీరు లేకపోయినప్పటికీ మధ్యాన్ని ఏరులుగా పాలించే ఘన చరిత్ర కలిగిన జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా సరైన ఆలోచన చేసి మధ్య నిషేధాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని అన్నారు. నియోజవర్గ నాయకులు శరణం విజయ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన ప్రజల ప్రాణాలతో చెలగాటమాడె మధ్యాన్ని నిషేదించాలని, సంపూర్ణ మధ్య నిషేధం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 31వ తేదీన జరుగుతున్న మహాధర్నాలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు రాయ్యప్ప, చెంచు, విశ్వనాధం, యం.రాంబాబు, యస్.రవి, యుగంధర్, మంత్రాలు, బడేష తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ 2024 ప్రకటించి, నిరుద్యోగ ఉపాధ్యాయలకు న్యాయం చేయాలనీ ఎస్టీయూ డిమాండ్ చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి యూ చంద్ర జిత్ యాదవ్ అన్నారు. ఎస్టీయూ (రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) చిలకలూరిపేట ప్రాంతీయ శాఖల సమావేశం ఏరియా కార్యదర్శి వినుకొండ అక్కయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కే కోటేశ్వర రావు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు నిర్వహించడానికి యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 12వ పీఆర్సీలో భాగంగా 30శాతం ఐఆర్ ఉద్యోగులు ఉపాధ్యాయులకు ప్రకటిచాలని డిమాండ్ చేశారు. కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయాలు ఉపాధ్యాయునీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలనీ, ఆదర్శ పాఠశాలలను విద్యాశాఖ లో విలీనం చేసి జీతాలు 010 హెడ్ ద్వారా చెల్లించాలనీ అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేయడం జరిగింది. సమావేశంలో జిల్లా జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, కార్యదర్శి షేక్ జామీర్ బాషా, బొంత రవి కుమార్, మస్తాన్ వలి, వేంకటేశ్వర రావు, సతీష్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు. నాగుర్ వలి, మక్బూల్ బాషా, దుర్గా ప్రసాద్. యస్ కాలేషా, చావలి మల్లేశ్వరరావు, హనుమంతు నాయక్, అన్ని మండలాల పట్టణ ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు. అనంతరం వార్షిక కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. మూడు మండలాలు పట్టణానికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభం

విశాలాంధ్ర-పెదకూరపాడు : పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని జలాలపురం గ్రామంలో సర్పంచ్ మాదిరెడ్డి సుజాత పరిపూర్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్మించబడిన సచివాలయం, రైతు భరోసా, వైఎస్సార్ క్లినిక్‌లను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం ఘనంగా ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సైతం గ్రామంలోనే పూర్తయ్యే విధంగా మన గ్రామ సచివాలయంలోని వీఆర్వోను ప్రభుత్వ ప్రతినిధిగా నియమిస్తూ జీవో నెంబర్ 36 సీఎం జగన్మోహన్ రెడ్డి జారీ చేశారని, ఇంతకుముందు పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలపై వారికి హక్కులు పొందటానికి 20 ఏళ్ల గడువు పట్టేదన్నారు. కానీ దానిని జగన్ ప్రభుత్వం సరళీకరణ చేసి పేదలకు సత్వర హక్కులను ప్రసాదించారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరి జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం వారికి నేరుగా నగదు బదిలీ చేసిన కారణంగా రాష్ట్రంలోని బ్యాంకులలో సామాన్య ప్రజానీకం చేసే డిపాజిట్లు పెరిగాయని వెల్లడించారు. సగటున సంవత్సరానికి 9.4శాతం చొప్పున పెరిగిన డిపాజిట్లు 88 వేల కోట్లకు చేరాయని, ఇందులో 60 శాతం పైగా మహిళలు డిపాజిట్ చేసినవి కావడమే విశేషమన్నారు. సర్పంచ్ సుజాత పరిపూర్ణారెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు అందుతున్న ప్రయోజనాలకు తోడు మరిన్ని ప్రయోజనాలు కలగాలంటే మళ్ళీ జగనే రావాలని, అందుకోసం అందరు కలిసి కృషి చేసినప్పుడే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామ పెద్దలు మాదిరెడ్డి అక్కిరెడ్డి, వెంకాయమ్మ, మార్కెట్ యార్డు సొసైటీ ప్రెసిడెంట్ ఈదా సాంబిరెడ్డి, జడ్పిటిసి ఎంపీటీసీ అబ్బురాజుపాలెం సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొల్లా పై పరోక్ష విమర్శలు

విశాలాంధ్ర -వినుకొండ : పల్నాడు జిల్లా వినుకొండ రాజకీయాల్లో కీలక పరిణామం. మాజీ ఎమ్మెల్యే వైసీపీ ముఖ్య నేత మక్కెన మల్లికార్జునరావు వైసీపీని వీడడం ఖాయమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మక్కెన మల్లికార్జున రావు వినుకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీరుపై ఆయన అసహనముతో ఉన్నట్లు మక్కెన పరోక్షంగా స్పష్టం చేయడమే కాకుండా.. ఒంటెద్దు పోకడ పనికిరాదంటూ నియోజకవర్గంలో కక్షలు కార్పన్యాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించొద్దని వినుకొండ లో ఎప్పుడు రౌడీయిజం లేదని పరోక్షంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీరును ఆయన ఎండగట్టారు. వ్యక్తిగత విమర్శలు చేయనంటూనే వినుకొండ నియోజకవర్గం అభివృద్ధి అంతా తానే చేశారన్న ధోరణి పనికిరాదంటూ బొల్లా ను ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు వినకొండకు ఎమ్మెల్యేలుగా పనిచేసిన పదిమందిలో తాను ఒకడినని తన హయాంతో పాటు అందరూ ఎమ్మెల్యేల సహకారంతోని వినుకొండ అభివృద్ధి పదంలో నడుస్తుందని చెప్పిన మక్కెన తన హయాంలో జరిగిన అభివృద్ధిని మీడియా సమక్షంలో వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నానని కచ్చితంగా 2024 ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. అభిమానులు తన అనుచరులతో చర్చించి త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని మక్కెన స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం వరకు . పదిమంది ఎమ్మెల్యేలుగా పనిచేశారని వీరిలో కొందరు రెండుమార్లు ఎమ్మెల్యేలుగా ప్రజా సేవ చేసి వినుకొండ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారని మక్కెన అన్నారు. ప్రధానంగా స్వాతంత్ర సమరయోధులు కమ్యూనిస్టు ఉద్యమ నేత పులుపుల వెంకట శివయ్య. వినుకొండ సర్పంచిగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంచి పేరు తెచ్చుకోవటంతో పాటు వినుకొండ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అలాగే గుర్రం జాషువా ఎమ్మెల్సీగా. ఎమ్మెల్యేలుగా నలబోలు గోవిందరాజులు. భవనం జయప్రద. గంగినేని వెంకటేశ్వరరావు. అవు దారి వెంకటేశ్వర్లు, నన్నపనేని రాజకుమారి,, వీరపనేని ఎలమందరావు. తర్వాత తాను . జీవి ఆంజనేయులు. ఎమ్మెల్యేలుగా పనిచేసే వినుకొండ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అయితే నేడు ప్రజా ప్రతినిధి నాలుగేళ్లుగా నాలుగు పనులు చేసి. తానే అంతా అభివృద్ధి చేస్తున్నానని, గత ఎమ్మెల్యేలు ఎవరు అభివృద్ధి చేయలేదని మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. ఏ ప్రజా ప్రతినిధికైనా అహంకారం అహంభావం మంచిది కాదని. వ్యక్తిగత దూషణలు చేయటం ప్రస్తుత ప్రజా ప్రతినిధి అహంకారానికి అద్దం పడుతుందని మక్కెన ఘాటుగా విమర్శించారు. వైయస్సార్ హయాంలో 2004 నుండి 2009 వరకు తాను ఎమ్మెల్యేగా పనిచేశానని. నియోజకవర్గంలో అన్ని మండలాల ప్రజా ప్రతినిధులను. వామపక్ష పార్టీల నేతలను. అందరం కలిసి మెలిసి వినుకొండను ఎంతో అభివృద్ధి చేశామన్నారు.వినుకొండ పట్టణంలో కమ్యూనిస్టులతో కలిసి ఎంతో అన్యోన్యంగా ఉంటూ అభివృద్ధి పనులతో ఈ నాలుగు ఏళ్లుగా ముందుకు సాగామన్నారు. ఎటువంటి మత ఘర్షణలకు తావు లేకుండా నలభై ఏళ్లుగా. వినుకొండ పట్టణం ఎంతో ప్రశాంతంగా ఉందని. అయితే నేడు ప్రస్తుత ప్రజాప్రతినిధి నోటి దురుసు విధానం. అహంకార ధోరణితో రెచ్చగొడుతూ పట్టణాన్ని అల్ల కల్లోలం చేస్తున్నాడని మక్కెన ఘాటుగా విమర్శించారు.

ప్రతి ఒక్కరికి సముచిత స్థానం :మంత్రి అంబటి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : వైఎస్సార్‌సీపీలో చేరే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని, కష్టపడి పని చేసే వారికి గుర్తింపునిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం రాజుపాలెం మండలం వీరమ్మ కాలనీ (కోట నెమలిపురి శివారు గ్రామం)కి చెందిన 16 కుటుంబాలు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబటి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్వయంగా మంత్రి అంబటి వైఎస్ఆర్‌సీపీ కండువాలు కప్పి వారందరినీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నాయకులతో కలిసి సమన్వయం చేసుకొని రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, జడ్పిటీసి సభ్యురాలు దొంతిరెడ్డి సునీతరెడ్డి, బాసు లింగారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, తేలుకుట్ల చంద్రమౌళి, వీరమ్మ కాలనీ వాసులు తదితరులున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని గారపాడు, జలాలపురం, బలుసుపాడు, పెదకూరపాడు గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చెక్‌డాం, సిసి రోడ్లు, రైతు భరోసా కేంద్రాలు, నూతన సచివాలయాలను ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. హామీలిచ్చి మర్చిపోయిన గత ప్రభుత్వానికి, ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేసిన తమ ప్రభుత్వానికి తేడా చూడాలని ఆయన ప్రజలను కోరారు. పెదకూరపాడు మండలం జలాలపురం గ్రామంలో రూ.75 లక్షల విలువైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించి రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగుతుందన్నారు. అందుకే పరిపాలను గ్రామస్థాయికి తీసుకొచ్చి సామాన్యుల కష్టాలు తీర్చారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్సీపీ కావాలో.. మభ్యపెట్టే టీడీపీ కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. తనను మరోసారి నమ్మి గెలిపిస్తే.. మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈ సామి రెడ్డి, ఎంపీపీ బెల్లకొండ మీరయ్య , జడ్పిటిసి సభ్యులు కంకణాల స్వర్ణకుమారి శివాజీ, కన్వీనర్ మస్తాన్ షరీఫ్, బొత్స హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఘటనకు కారకులైన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : కర్నూలు జిల్లాలోని ఆదోని పట్టణంలో ప్రధాన కూడలి అయిన ఎంఎం రోడ్డులో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి కొందరు ముష్కరులు పేడను పులిమి అగౌరపరచటాన్ని పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆటీపా పట్టణ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను తెచ్చిన మహానుభావుని విగ్రహానికే ఈ ఆంధ్ర రాష్ట్రంలో రక్షణ కరువైందని, ఈ సంఘటనకు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: భారతావని ఆవిర్భావం నుండి నేటి వరకు దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో అతి ప్రధాన సమస్యలు పేదరికం, నిరుద్యోగం. దేశం లో "చట్టసభలకు" లోకసభ రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు యువతను ఆకర్షించడానికి నిరుద్యోగ నిర్మూలనను ఓటు బ్యాంకు నినాదంగా మార్చివేశాయనీ నిరుద్యోగ నిర్మూలన ఎన్నికల్లో రాజకీయ నినాదంగానే మిగిలి పోయిందినీ,"కేంద్ర ప్రభుత్వం ఆదీనంలో ఉన్న 12 కోట్ల 8 లక్షల ఉద్యోగాలు భర్తీ కై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక విధానాలను యువతకు వివరించి యువతను చైతన్యం చేసి,కేద్రంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి, విద్య, వైద్యం, ఉపాధి హక్కులను కాలరాస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేఖంగా పోరాటాలకు సిద్ధమై హక్కులను కాపాడుకోవడం కోసం వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా సదస్సు ఉండేబోతుందినీ ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ సుభాని తెలిపారు. ఈ సదస్సుకు యువత, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలి రావాలినీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట ఏఐవైఎఫ్ నాయకులు మల్లికార్జున్, నవీన్, రవి వర్మ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధం: జీవీ

విశాలాంధ్ర -వినుకొండ : జగన్‌రెడ్డి అహంకారానికి, వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కార్మికులు, కర్షకులు, ప్రభుత్వ ఉద్యోగులు అన్ని వర్గాలు సిద్ధమయ్యారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో యుద్ధం మొదలైందని కురుక్షేత్ర ధర్మ యుద్ధంలో టీడీపీ జనసేన సంయుక్తంగా విజయం సాధిస్తుందని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఇలాంటి పార్టీ అవసరం లేదని ప్రజలు నిర్ణయానికి వచ్చారన్నారు. ప్రజలపై కొత్త పనులు భారం మోపి ప్రజల రక్తాన్ని జలగల పీల్చారని ఆయన విమర్శించారు. టిడిపి పాలనలో లేని అప్పులు నేడు రాష్ట్రం అప్పుల హబీలో కూరుకుపోయి ఇన్ని కష్టాలు ఎందుకు వచ్చాయి అనేది ప్రజల ఆలోచిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ బాధితులు రైతులు, నిరుద్యోగులు, మహిళలు టిడిపికి స్టార్ క్యాంపెనర్లు అని అన్నారు. రూ.200లు ఉన్న విద్యుత్ బిల్లులు ఎప్పుడు ఐదు రెట్లకు పెంచి దోచుకుంటున్నారని అన్నారు. మద్యం, నిత్యవసర వస్తువులు ధరలు, ఆర్టీసీ బస్సులు చార్జీలను పెంచుతూ ప్రజలను దోపిడీ చేశారని , టిడిపి పాలనలో అందరికీ ఉచితంగా ఇచ్చిన ఇసుక నేడు సామాన్యులకు అందనంత ధరకు చేరిపోయి వైసిపి ఇసుక దోపిడీ చేస్తుందని అన్నారు. వైసిపి అసమర్థపాలనతో అప్పులు పెరిగి వాటికి వడ్డీలు భారంగా పెరిగి ఆ భారం ప్రజలపై పడుతుందన్నారు. జగన్ రెడ్డి భూ సర్వే చేసి ప్రజల భూములను లాక్కోవాలని పథకం వేశాడని విమర్శించారు. జగన్ రెడ్డి సీట్లను అభ్యర్థులకు ప్రకటిస్తుంటే అభ్యర్థులు మాత్రం వైసిపిని వదిలిపెట్టి పోతున్నారని అన్నారు. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు నలుగురు ఎంపీలు వైసీపీని వదిలి వెళ్లారని రానున్న ఎన్నికల్లో ఈ వైకాపా ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజల సిద్ధమయ్యారని తెలిపారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

యువతకు స్ఫూర్తి చిరంజీవి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత పద్మవిభూషణ్ చిరంజీవి అని సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొర్ర వెంకట అప్పారావు అన్నారు. చిరంజీవికి వచ్చిన అవార్డును పురస్కరించుకుని పార్టీ కార్యాలయం వద్ద టపాసులు పేల్చి కేక్ కట్ చేశారు. చిరంజీవికి పద్మ విభూషణ్ ప్రకటించడం పట్ల భారత ప్రభుత్వానికి బీజేపీ పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో భారతరత్న తీసుకోవాలని కోరుకుంటున్నామన్నారు. రక్తదానం, నేత్రదానం, ప్రకృతి వైపరీత్యాలు జరిగిన అనేక సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తి చిరంజీవి అని, కరోనా కాలంలో ఆక్సిజన్ సెంటర్లు ప్రజలకు అందేలా చేసినట్లు చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే నేను ఈ స్థాయికి వచ్చానని, స్వయంకృషితో ఉన్నత శిఖరాలు అధిరోహించిన వ్యక్తి చిరంజీవి అని కొనియాడారు. వెంకయ్య నాయుడుకు పద్మ విభూషణ్ రావడం అతను తెలుగు వ్యక్తి, మాజీ ఉపరాష్ట్రపతిగా చేసిన ఆయనకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు చెప్పారు.

యూటీఎఫ్ మోడల్ పేపర్ల పంపిణీ

విశాలాంధ్ర-యడ్లపాడు : మండలంలో లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ప్రచురించిన ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లను వైఎస్ఆర్‌సీపీ నాయకులు, జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా ఉచితంగా పంపిణీ చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు ఈ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలియచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ షేక్ మహబూబ్ సుభాని, పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ మీరావలి, ఎంపీటీసీ సభ్యులు తోకల వీర రాఘవయ్య, నంబూరు శివ రామకృష్ణయ్య, యూటీఎఫ్ నాయకులు కె.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాళ్ళూరు సర్పంచ్‌గా భూతం నర్సయ్య

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75వ తాళ్ళూరు గ్రామ సర్పంచ్‌గా భూతం నరసయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నరసయ్యను దుశ్శాలువాతో అభినందించారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామాభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషిచేయాలని, తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి అల్లం భవాని, మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ వజ్రాల శ్రీనివాసరెడ్డి, భూతం బాబు, సుధాకర్, రాజు, దాసు, వెంకటరెడ్డి, జడ్పీ హైస్కూల్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర -వినుకొండ : స్థానిక వివేకానంద పాఠశాల 36వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం పట్టణంలోని గంగినేని గార్డెన్స్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ రావు(డిఈఓ) పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక స్నేహాలు మనం ఉండే పరిసరాలను బట్టి స్నేహితులను బట్టి వారి ప్రవర్తన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. స్వామి వివేకానందుని మహాత్మా గాంధీ వంటి వారి జీవిత చరిత్రలు చదవడం ద్వారా యువత ఆలోచన విధానంలో మార్పులు వస్తాయని, మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలు సాంస్కృతి కార్యక్రమాలు ఫ్యాషన్ షోలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వివేకానంద విద్య సంస్థల చైర్మన్ సయ్యద్ రఫిక్, అహ్మద్ మరియు పాఠశాల నిర్వాహకులు సయ్యద్ అరిఫ్, వినుకొండ ఎంఈఓ జఫరుల్లా ఖాన్, అనూష, కౌన్సిలర్ భాష ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

SATTENAPALLI MUNICIPALITY : SATTENAPALLE
e-Procurement Short Tender Notice

Short Tender Notice No.31/2023-24/E1/SAPMPLTY, Dt. 27-01-2024

1.	No. of works	2.00 Nos.
2.	Total Value of Works	4.60 Lakhs
3.	Bid Document Download Starting Date	29/01/2024 11.00 AM
4.	Bid Document Download End Date	05/02/2024 2.00 PM
5.	Last Date & Time for receipt of bids	05/02/2024 3.00 PM
6.	Bid Opening Date	05/02/2024 4.00 PM

Further details can be seen @e-Procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner,
SATTENAPALLI MUNICIPALITY : SATTENAPALLE